క్లుప్తంగా

లాటరీ ద్వారా ఉద్యోగికి లడ్డూ ప్రసాదం అందజేత



ఉద్యోగికి లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న జిల్లా వైద్యాధికారి షర్మిష్ట

ఏలూరు (టూటౌన్) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలోని సర్వమత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో ఉంచిన లడ్డూను డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ షర్మిష్ట లాటరీ ద్వారా ఉద్యోగికి అందించారు. శనివారం లడ్డూ లాటరీ తీయగా ఎన్‌హెచ్ఎం సెక్షన్ నందలి ఎంవీ భారత్ కుమార్ అనే ఉద్యోగికి లాటరీ తగిలింది. ఈ సందర్భంగా సదరు ఉద్యోగిని డీఎంఅండ్‌హెచ్‌ఓ సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేసారు. జిల్లాలోని వైద్య ఆరోగ్య సిబ్బందికి ఏ విధమైన విఘ్నాలు కలుగకుండా ఉండాలని , జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలనాధికారి మురళీకృష్ణ, జిల్లా ఎన్‌జీవో సంఘం కార్యదర్శి నెరుసు రామారావు, ఆలయ కమిటీ సభ్యులు నరసింహా, ఈశ్వర్రావు, నెల్లి ప్రసాద్, లక్ష్మి, వాసు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేదం హిందూ ధర్మానికి మూలం



సంస్కృత వేద పాఠశాలను సందర్శించిన రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వేదం హిందూ ధర్మానికి మూలమని, వేదం పదికాలాల పాటు నిలబడితే హిందూ ధర్మం కూడా పది కాలాల పాటు నిలబడుతుందని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. శనివారం ఏలూరు జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఏలూరు నగరానికి విచ్చేసిన విష్ణు ఉదయం స్థానిక సంస్కృత వేద పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నగరంలో వేదాలు నేర్పడానికి ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ద్వారా వేద పండితులు తయారు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్కృత వేద పాఠశాల స్థలం వివాదం విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని చేసిన సిఫార్సులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, సంస్కృత వేద పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకట రమణ ప్రసాద్, తూములూరి విశ్వనాథ శాస్త్రి, సలహాదారు బీకేఎస్ఆర్ అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ద్వారకా తిరుమలేశుని కల్యాణం



ధర్మభేరి ప్రాంగణంలో శ్రీ ద్వారకా తిరుమలేశుని కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



భక్తులకు స్వామి వారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని జ్యూట్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసిన ధర్మభేరి ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్రిశూల గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ద్వారకాతిరుమల నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ద్వారకాతిరుమల ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నగరానికి చెందిన వాణిజ్యవేత్త నారా శేషు దంపతులు, ఇతర కుటుంబ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా గణపతి నవరాత్రి వేడుకలు

నగరంలో గణపతి నవరాత్రి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. స్థానిక విజయవిహార్ సెంటర్లో రామ్ లక్ష్మణ జిమ్ యూత్, విజయ విహార్ సెంటర్ వర్తకుల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు రెండో సంవత్సరం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల నిమిత్తం హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన 20 అడుగుల వినాయకుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. శనివారం స్థానిక విజయ విహార్ సెంటర్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. ముందుగా ఆమె స్వామివారి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. స్వామివారి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

రూ. 8 లక్షలతో అలంకరణ..

స్థానిక దక్షిణపు వీధిలో సదరన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో గణపతి విగ్రహానికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రూ.8 లక్షల విలువల చేసే కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు.

ఆటో మెకానిక్ వర్కర్లకు వైద్య పరీక్షలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పవరుపేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర కళ్యాణమండపంలో శనివారం తపన ఫౌండేషన్ సహకారంతో భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ఆటో మెకానిక్ యూనియన్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కార్మికులకు పోస్టల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కార్డులను, ఆయుష్మాన్ భారత్ కార్డులను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏ.రాజు, కాశేశ్వరరావు, మజ్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 63 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నాల్గవ రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షలకు 64 మంది విద్యార్థులకు గాను 63 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షలలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును పటిష్టంగా అమలుచేయాలి



మహిళా ఉద్యమ నేత గీతా ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి

ఏలూరు (టూటౌన్): మహిళా రిజర్వేషన్ బిల్లును రాబోయే ఎన్నికలలో బేషరతుగా అమలు చేయాలని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి కోరారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు శనివారం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొండేటి బేబి అధ్యక్షతన ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్ల కోసం సీపీఐ, గీతా ముఖర్జీ చేసిన పోరాట ఫలితంగానే నేడు చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఆమోదం పొందిందన్నారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా నేడు మహిళా బిల్లు వెలుగు చూసిందన్నారు. జనగణన, పునర్ విభజన వంటి అడ్డంకులను తొలగించి లోక్‌సభ, రాజ్యసభతో పాటు అన్ని రాష్ట్రాల శాసన సభ, శాసనమండళ్లలో రిజర్వేషన్ వర్తించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మన్నవ యామిని మాట్లాడుతూ చట్టసభలలో రిజర్వేషన్, సామాజిక న్యాయం కోసం పోరాటాలకు మహిళలందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో కొండేటి బేబి, పోలా భాగ్యలక్ష్మి, జి.స్వాతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా మహిళా రిజర్వేషన్ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన గీతా ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మావూరి విజయ, స్వప్న, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు



సదస్సులో మాట్లాడుతున్న ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు జీజీహెచ్, సర్.సీఆర్ రెడ్డి ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 3వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మందుల వాడకం వలన వచ్చే ప్రతికూల ప్రభావాలను ఎలా అర్థం చేసుకోవాలో వివరించి ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అదే విధంగా మందులను అధికంగా వినియోగిస్తే కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వైద్య, నర్సింగ్ విద్యార్థులు, డాక్టర్లతో ర్యాలీలు నిర్వహించామన్నారు. వారోత్సవాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డా. కె.భాస్కర్, డా.పి.సత్యనారాయణ, ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.శశిధర్, సీఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, కరస్పాండెంట్ మాగంటి రాజారామ్మోహన్‌రావు, ఫార్మాకాలజీ విభాగ అధిపతి ప్రొ.పద్మావతి, ఇతర ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

దెందులూరు: ఏలూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారని ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్యచౌదరి అన్నారు. బీఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు బయోడేటా జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుల జెరాక్స్‌లతో నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

30న నారాయణపురంలో..

ఉంగుటూరు: ఈనెల 30న నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. జెడ్పీటీసీ జయలక్ష్మి మాట్లాడుతూ 30వ తేదీన ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొని వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాను నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా స్ప్రే



డ్రోన్‌కు పెస్టిసైడ్స్ అమర్చుతున్న రైతు, మల్కాపురంలో డ్రోన్ ద్వారా స్ప్రే చేస్తున్న అధికారులు



ఏలూరు రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. నిన్నటి వరకూ యంత్రాలతో దుక్కుదున్నడం, నాట్లు వేయడం, కోతలు, ఊడ్పులు చేపట్టిన రైతులు, నేడు డ్రోన్స్ ద్వారా చీడపురుగుల నివారణకు వరిసాగుపై స్ప్రే చేయడం నేర్చుకుంటున్నారు. శనివారం ఏలూరు మండలం మల్కాపురంలో జిల్లా వ్యవసాయశాఖ ఉప సంచాలకులు సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్యతో పాటు కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు డ్రోన్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌లో పెస్టిసైడ్స్ అమర్చడం, రిమోట్ ద్వారా డ్రోన్‌ను కంట్రోల్ చేయడం నేర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ డ్రోన్‌తో పెస్టిసైడ్స్ స్ప్రే చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు కూలీలు రసాయనాల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. పెట్టుబడి వ్యయం సైతం తగ్గుతుందన్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకే కేంద్రాల వద్ద రైతులకు డ్రోన్స్ అందుబాటులో ఉంచుతుందన్నారు.

26న కేవీఎస్ ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న హిందూ యువజన సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం, కేవీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న కేవీఎస్ ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు హిందూ యువజన సంఘం అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు తెలిపారు. శనివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని కార్యవర్గ సభ్యులు విడుదల చేశారు. 2023 సంవత్సరానికి గాను కేవీ సత్యనారాయణ ప్రతిభా పురస్కారాన్ని నాట్య గురువు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ కూచిపూడి నాట్య విభాగాధిపతి 'కళారత్న' డాక్టర్ వనజా ఉదయ్‌కు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వివిధ నృత్య సంస్థలకు చెందిన కళాకారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభా కార్యక్రమానికి శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని చెప్పారు. నగర ప్రజలు, కళాభిమానులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి



స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని చర్మకారులతో మాట్లాడుతున్న పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని చర్మకారులు తమ ప్రాంతాల్లో ఉన్న కామన్ సర్వీసు సెంటర్‌లో కానీ, సచివాలయంలో కానీ పీఎం విశ్వకర్మ యోజన ద్వారా అందించే రూ.లక్ష రుణ సదుపాయాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలిమేర హరికృష్ణ కోరారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని పలువురు చర్మకారులకు ఈ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రుణాన్ని పొందడం ద్వారా వ్యాపారాలు అభివృద్ధి పరుచకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే రుణాన్ని అందుకొని ఐదు శాతం వడ్డీతో తిరిగి చెల్లించి, తర్వాత రూ.2 లక్షలు రుణాన్ని పొందాలన్నారు. మార్కెట్‌లో ఎస్‌టీడీ వడ్డీల బారిన పడకుండా చేతివృత్తుల వారందరూ ఈ పథకాన్ని అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏలూరు ప్రాంతంలో అధిక సంఖ్యలో చర్మకారులకు పింఛన్లు ఇప్పించిన మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో ఏలూరులో రాష్ట్ర చర్మకారుల సంఘం 30 వసంతాల వేడుకను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి బేవనపల్లి లక్ష్మణరావు, నగర సంఘం అధ్యక్షుడు చోదిమెళ్ళ నాగరాజు, నాయకులు పాలిమేర దుర్గారావు, మందపాటి ఏసు, ఉలసాల పోతురాజు, చీలి వీరబాబు, పులసల మధుబాబు, చింతాటి వెంకన్న, కటారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం



సీపీఎం జిల్లా శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): దేశంలో బీజేపీ మతోన్మాద శక్తుల ప్రమాదం పట్ల ప్రజలను జాగృతి పరచాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఎం శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రపంచం మొత్తం ఆధునిక టెక్నాలజీతో ముందుకు సాగుతుంటే దేశంలో బీజేపీ మతోన్మాద శక్తులు మూఢత్వ ప్రచారాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాఠ్యపుస్తకాల్లో మహాత్మాగాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధుల పాఠాలు తొలగించి ఆయన్ను చంపిన గాడ్సే, సావర్కర్ వంటి వారి గురించి రాస్తున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం, ఉపాధి సమస్య తీవ్రంగా ఉన్నాయని అన్నారు. ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మణిపూర్, హర్యానా రాష్ట్రాల్లో మత ఘర్షణలు సృష్టించి చిచ్చు పెడుతుందని విమర్శించారు. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని చూస్తుందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా మతోన్మాద రాజకీయాలు–ప్రతిఘటన ఉద్యమాలు అనే అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ లింగరాజు మాట్లాడారు. దేశంలో వివిధ ప్రభుత్వాల నయా ఉదారవాద విధానాలపై గుడిపాటి నరసింహారావు వివరించారు. కార్యక్రమంలో డీఎన్‌వీడీ ప్రసాద్, బి.సోమయ్య, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజ్ఞ భాషా దినోత్సవం



బధిరుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

ఏలూరు రూరల్: బధిరుల కోసం రూపొందిన సంజ్ఞ భాష ప్రపంచ గుర్తింపు పొందిందని ఏలూరు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ సంజ్ఞ(సైన్) భాషా దినోత్సవం సందర్భంగా శనివారం దొండపాడు బధిరుల పరివర్తన పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బధిరుల కోసం ఏర్పాటైన సంజ్ఞ భాష ఎంతోమందికి మేలు చేస్తుందన్నారు. సంజ్ఞ భాషపై సాధారణ ప్రజలు సైతం మరింత అవగాహన పెంచుకుంటే బదిరులకు మరింత దగ్గర కావచ్చన్నారు. ఈ సందర్భంగా బధిరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 7కోట్ల మంది బధిరులు ఉన్నారని, వీరు 300కు పైగా సంజ్ఞ భాష వాడుతున్నారని వివరించారు. తొలుత సత్యనారాయణతో పాటు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	14
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	07
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	03
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	454	చిక్కుడు కాయలు	120
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	50	ములక్కాడలు	04-06
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	24-28	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	120-220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	06
దోసకాయలు	26-30	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48
		నిమ్మకాయలు (డజను)	--